

అమూల్ పాలకేంద్రం సందర్శన
చౌటపల్లి(తిరువూరురూరల్): చౌటపల్లిలో ఏర్పాటు చేసిన అమూల్ మిల్క్ చిల్లింగ్ సెంటర్‌ను గురువారం ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్ సందర్శించారు.



కొవ్వొత్తుల ర్యాలీ
విజయవాడస్పోర్ట్స్: గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలని కోరుతూ గురువారం విజయవాడలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు.

జిల్లా సహకార శాఖ అధికారిగా శ్రీనివాసరెడ్డి


విజయవాడ రూరల్: ఎన్టీఆర్ జిల్లా సహకార శాఖ అధికారిగా శ్రీనివాసరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయనకు డీసీఓ, డీసీఏఓ, డీఎల్‌సీవో సిబ్బంది, ఆప్కాబ్ సర్వీస్ సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
విజయవాడ	6.23	4.58
జగ్గయ్యపేట	6.23	5.06
మచిలీపట్నం	6.21	4.56
గుడివాడ	6.23	4.58

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు కమిటీలు
గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా, నగర అనుబంధ విభాగ కమిటీ అధ్యక్షులను నియమించారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన పత్రి శ్రీనివాస్‌ను, విజయవాడ నగర బీసీ సెల్ ప్రెసిడెంట్‌గా బోను రాజేష్‌కుమార్, యూత్ వింగ్ నగర ప్రెసిడెంట్‌గా జొన్నలగడ్డ రామకృష్ణ నియమితులయ్యారు.

కృష్ణా జిల్లాలో..

మచిలీపట్నం వైఎస్సార్‌టీయూసీ కమిటీ అధ్యక్షుడిగా యెగ్గోని గాంధీ, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి సత్యనారాయణ, బత్తుల దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా గురు హర్షకుమార్, తప్పిట రత్న భూషణరాజు, కిషోర్, షేక్ బాజీ, ఎస్పీ రామకృష్ణ, మీసాల శ్రీనివాసరావు నియమితులయ్యారు.

దుర్గమ్మకు 12.5 కిలోల వెండి గంగాళాలు


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు నగరానికి చెందిన భక్తులు 12.5 కిలోల వెండి గంగాళాలు, మూతలను గురువారం ఆలయ అధికారులకు అందజేశారు. విజయవాడ గుంటుపల్లికి చెందిన కృష్ణవంశీ, అఖిల్ పేరిట వారి కుటుంబ సభ్యులు 12.510 కిలోల వెండితో తయారు చేయించిన రెండు గంగాళాలు, వాటికి అవసరమైన మూతలను ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ ఈవో కేఎస్ రామారావులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం చైర్మన్, ఈవోలు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్‌గా నాగరాజు


ఇబ్రహీంపట్నం: నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ చీఫ్ ఇంజినీర్‌గా టి.నాగరాజు నియమితులయ్యారు. కడప రాయలసీమ థర్మల్ పవర్‌ప్లాంట్‌లో సీఈగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చిన ఆయన సంస్థ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఈగా పని చేసిన పి.నవీన్‌గౌతమ్‌ను విజయవాడ విద్యుత్ సౌధకు జనరల్ మేనేజర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన చీఫ్ ఇంజినీర్ నాగరాజుకు సంస్థ, ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో 'ఇంజినీరింగ్' అధ్యాపకుని ప్రతిభ


గుడివాడ టౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ కొడాలి జీవన్‌కుమార్ రెండు స్వర్ణపతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు గురువారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఈ నెల 12న జరిగిన 11వ అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మాస్టర్స్ వెయిట్ విభాగంలో బెంచ్ ప్రెస్, ఓవరాల్ పవర్ లిఫ్టింగ్‌లో ప్రథమస్థానం సాధించి రెండు స్వర్ణపతకాలు, అభినందన పత్రం అందుకున్నట్లు పేర్కొన్నారు. జీవన్‌కుమార్‌ను, కోచ్ వెంకటేశ్వరరావును కరస్పాండెంట్ కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరా

ఆసరా.. సాధికారతకు భరోసా...
- పొదుపు మహిళలను ఆర్థికంగా ఆదుకున్న సీఎం జగన్
- బ్యాంకు లింకేజీ అప్పు నిల్వ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని హామీ
- అధికారంలోకి వచ్చాక 'వైఎస్సార్ ఆసరా' అమలు
- కృష్ణా జిల్లాలోని 3.28లక్షల మంది మహిళలకు రూ.1,039.58కోట్ల జమ
- నాడు డ్వాక్రా రుణాలమాఫీ అంటూ మోసం చేసిన చంద్రబాబు
- నేడు మహిళలను లక్షాధికారులను చేసిన సీఎం వైఎస్ జగన్



ఈ ఏడాది జనవరి 23న నాలుగవ విడత కింద పొదుపు మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు (ఫైల్)

సాక్షి, మచిలీపట్నం: సమాజంలో మహిళా సాధికారతకు రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. వారికి ఆర్థిక ఆసరా అందజేస్తోంది. గత ప్రభుత్వం మహిళ అభ్యున్నతిని విస్మరిస్తే.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం గత పాలకులకు భిన్నంగా మహిళ కోసం విప్లవాత్మక పథకాలను తెచ్చారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అమలుచేశారు. నవరత్నాలతో మహిళా ఆర్థిక వృద్ధిని పెంచారు. అత్యధిక శాతం పథకాలను వారి పేరుతో మంజూరు చేశారు.

సమాజంలో గుర్తింపు

సమాజంలో మహిళలకు గుర్తింపు తెచ్చారు. ప్రధానంగా పది మంది స్త్రీలు కలిసి ఒక స్వయం సహాయక (పొదుపు) సంఘంగా ఏర్పడి.. బ్యాంకులో తీసుకున్న అప్పు నిల్వ మొత్తాన్ని చెల్లించారు.

గత ఎన్నికల్లో ఇచ్చిన ఈ హామీని నాలుగు విడతల్లో చెల్లించి మాట నిలుపుకున్నారు. 'వైఎస్సార్ ఆసరా' కింద నేరుగా వారి ఖాతాలోకి జమ చేసి, ఆర్థిక భరోసా ఇచ్చారు. ఆ సొమ్ముతో అక్క చెల్లెమ్మలు తమ ఆర్థిక అవసరాలు తీర్చుకుంటూ స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకొని, కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

ఆర్థిక భరోసా

గత టీడీపీ ప్రభుత్వ మోసాలు, స్త్రీల కష్టాలు తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా సంఘాలకు అభయం ఇచ్చారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాలు తీసుకున్న బ్యాంకు లింకేజీ అప్పు నిల్వ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. బ్యాంకర్ల ఒత్తిడి కారణంగా ఒకవేళ మహిళలు అప్పు నిల్వ చెల్లించినా ఆ మొత్తాన్ని నేరుగా ఆయా గ్రూపుల మహిళల ఖాతాలోకి జమ చేస్తానని స్పష్టం చేశారు. దీని కోసం 'వైఎస్సార్ ఆసరా' పథకాన్ని అమల్లోకి తెచ్చారు. మహిళల ఆర్థికాభ్యున్నతికి ఈ పథకం ఎంతోగానో ఉపయోగపడుతోంది. జిల్లాలో అనేక మంది మహిళలు వారి వ్యాపారాన్ని పెంచుకుంటున్నారు. కొందరు మహిళలు బడ్డీకొట్లు, కూరగాయల వ్యాపారాలు ఏర్పాటుచేసుకుని వారి కుటుంబానికి భరోసా ఇస్తున్నారు. వారి పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు. అవసరమైన పొదుపు చేసుకుంటూ ఈ వ్యాపార ఆదాయాలను డ్వాక్రా సంఘాల మహిళలు

3.28 లక్షల మంది ఖాతాలోకి రూ.1,039.58 కోట్లు
కృష్ణా జిల్లాలో వైఎస్సార్ ఆసరా కింద అర్హత పొందిన 3,28,925 మంది సభ్యులకు లబ్ధి చేకూరింది. మొదటి విడత కింద 26,126 గ్రూపులకు రూ.246.22 కోట్లు, రెండు విడతలో 26,330 గ్రూపులకు, రూ.250.34కోట్లు, మూడో విడతలో 26,230 గ్రూపులకు రూ. 248కోట్లు, నాలుగో విడతలో 31,336 గ్రూపులకు రూ.295.02 కోట్లు మొత్తం నాలుగు విడతల్లో 31,289 సంఘాలు (3,28,925 మంది మహిళలు)లకు మొత్తం రూ.1,039.58కోట్లను నేరుగా ఆయా సంఘాల మహిళల ఖాతాలోకి జమ చేశారు. 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని, ఎవ్వరూ బ్యాంకు రుణాలు చెల్లించవద్దని చెప్పి.. అధికారంలోకి వచ్చాక మహిళలను చంద్రబాబు మోసం చేశారు. కానీ నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలను లక్షాధికారులు చేశారు.

రూ.77వేలు జమ చేశారు


నా భర్త శ్రీనివాసరావు రోజువారి సంపాదన ఇద్దరు పిల్లల చదువు, కుటుంబ పోషణకు చాలేది కాదు. డ్వాక్రా గ్రూపు ద్వారా తీసుకున్న రుణ నిల్వ నాలుగు విడతల్లో రూ.77,076 జమయ్యాయి. ఈ సొమ్ముతో సొంతంగా ఒక కారం మిల్లు వ్యాపారాన్ని ప్రారంభించాను. దీంతో నెలకు నేను రూ.18వేల వరకు ఆదాయం పొంది కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నాను. జగనన్నకు కృతజ్ఞతలు.

– నేరుసు రమ్య, కొత్త మాజేరు గ్రామం, చల్లపలి, మండలం

'ఆసరా'తో బడ్డీకొట్టు


డ్వాక్రా సంఘం ద్వారా తీసుకున్న రుణాన్ని మా ఖాతాలోకి జమ చేయడంతో నాకు రూ.70 వేలు అందాయి. దీని ద్వారా నేను బడ్డీకొట్టు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాను. నా భర్త శ్రీనివాసరావు సంపాదనకు నా సంపాదన తోడు కావడంతో కుటుంబం ఆర్థికంగా ఎదిగింది. పిల్లల చదువుకు ఇబ్బందులు లేకుండా సాగాయి. ఇచ్చిన హామీని పక్కాగా అమలు చేసిన ఏకైనా సీఎం మా జగనన్న.

– మోర్ల లక్ష్మి, చర్లపల్లి

పారదర్శకంగా జమ


ఆసరా పథకం అర్హత ఉన్న ప్రతి మహిళకు అందింది. దీన్ని డీబీటీ కింద ఎవరి సిఫార్సు లేకుండా నేరుగా మహిళల గ్రూపు ఖాతాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. దీంతో మూడు విడతల్లో కృష్ణా జిల్లాలోని 3.28 లక్షల మంది మహిళలకు రూ.1,039.58కోట్ల లబ్ధి కలిగింది.

– ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ, కృష్ణా జిల్లా

'బీఎస్ఎన్ఎల్' సమస్యలు పరిష్కరించుకోండి
సంస్థ జీఎం రవీంద్రనాథ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ కోర్టుల్లో నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను.. క్లోజ్ చేయబడిన బీఎస్ఎన్ఎల్ ఫోన్‌ల తాలూకు వినియోగదారులు తమ బకాయిలను చెల్లించుకోవడానికి వినియోగించుకోవాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వై. రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని విజయవాడ, కైకలూరు, గుడివాడ, నూజివీడు, అవనిగడ్డ, తిరువూరు, మచిలీపట్నం, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, ఉయ్యూరు, గన్నవరంలోని కోర్టుల్లో నేషనల్ లోక్ అదాలత్ జరుగుతుందని వివరించారు. బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి క్లోజ్ చేసిన బ్రాడ్ బ్యాండ్, ఎఫ్‌టీటీహెచ్, మొబైల్ పోస్ట్ పెయిడ్ , లీజ్డ్ సర్క్యూట్స్ తాలూకు వినియోగదారులకు న్యాయసేవాధికార సంస్థల ద్వారా నోటీసులు జారీచేశారని తెలిపారు. సదరు వినియోగదారులు కోర్టుకు హాజరు కాకుండా ముందుగానే తమ బకాయిలు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీలోపు వడ్డీ లేకుండా బకాయిలు చెల్లించవచ్చని, సమస్య పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత రాయితీ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. బకాయిల తీర్మానం తర్వాత సర్వీసులను పునరుద్ధరణ చేసుకోవచ్చని వివరించారు. మరింత సమాచారానికి 0866–2444266 / 2444588 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

ఎస్ఆర్ఆర్‌లో ప్రపంచ గణిత దినోత్సవం
మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గణిత శాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, పోస్టర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి ఎం.లక్ష్మణదాసు, కె. ఆశోక్ అధ్యాపకులు ఎం.సుధాకర్, షేక్ సజన, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి నేస్తం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జేసీ గీతాంజలి శర్మ, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి తదితరులు

- వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడో విడత నిధుల విడుదల
- జిల్లాలో 9,938 మందికి రూ. 14.90 కోట్లు
- లబ్ధిదారులకు చెక్కు అందజేసిన జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): అగ్రవర్ణ పేద మహిళల సాధికారతకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం తోడ్పడుతుందని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ చెప్పారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధులను బటన్ నొక్కి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్‌లో వీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జిల్లాలో రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ తదితర ఆర్థికంగా వెనుకబడిన కులాల వారికి వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందజేస్తోందన్నారు. 2022 జనవరి 25వ తేదీన ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 21,725 మంది లబ్ధిదారులకు రూ. 32.58 కోట్లు ఆర్థిక సాయం మంజూరు చేశారని తెలిపారు. అనంతరం 9,938 మంది లబ్ధిదారులకు రూ. 14.90 కోట్ల బ్యాంకు నమూనా చెక్కును జేసీ లబ్ధిదారులకు అందజేశారు. కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ పద్మావతి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారన్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ కె.రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

తోబుట్టువులా ఆర్థిక సాయం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోబుట్టువులా తమకు ఈబీసీ నేస్తం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. పేదరికంలో ఉన్న మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– పాలంకిపాటి లావణ్య, మచిలీపట్నం

వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నా


ఈబీసీ నేస్తం పథం ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నాను. తాను, తన భర్త కూరగాయల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

–మాకర్ల పద్మావతి, మచిలీపట్నం

నాన్నలా పేరు తెచ్చుకుంటా..

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి
- వైఎస్సార్‌సీపీ బందరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు



దక్షిణచిరువోలులంకలో ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తున్న డాక్టర్ చంద్రశేఖరరావు

దక్షిణచిరువోలులంక(అవనిగడ్డ): తన తండ్రి సింహాద్రి సత్యనారాయణలా పేరు తెచ్చుకుంటానని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి చంద్రశేఖరరావు చెప్పారు. ఆయన గురువారం దక్షిణ చిరువోలులంకలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తొలుత ఆయన గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవచేయాలనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోటీలో ఉన్నట్లు చెప్పారు. మచిలీపట్నం పార్లమెంట్‌కు తనను, అసెంబ్లీకి రమేష్‌బాబును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యం, సింహాద్రి చంద్రశేఖరరావు తనయుడు రామ్‌చరణ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో అసంతృప్తి సెగలు

- సీనియర్లకు మొండి చేయి
- దేవినేని ఉమా, బుద్ధప్రసాద్, బోడె ప్రసాద్‌కు షాక్
- రాజీనామాకు 'బోడె' వర్గం సిద్ధం
- ఇండిపెండెంట్‌గా పోటీకి..
- విజయవాడ 'పశ్చిమ'లో కుర్చీలాట
- సూట్‌కేసు బాబులకే లోకేష్ పెద్దపీట
- లోకేష్ పెత్తనంపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం





పెనమలూరులో టీడీపీ కార్యాలయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకున్న కార్యకర్త, మాట్లాడుతున్న బోడె ప్రసాద్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీలో అసంతృప్తి సెగ రేగింది. మరోవైపు పొత్తుల చిచ్చు ఆ పార్టీని పుట్టి ముంచుతోంది. టీడీపీ రెండో జాబితా గురువారం ప్రకటించడంతో పార్టీలో విభేదాలు కట్టలు తెంచుకుంటున్నాయి. ఓవైపు జనసేన, బీజేపీతో పొత్తు మరోవైపు కొత్తగా చేరిన నేతలతో టీడీపీ అతలాకుతలం అవుతోంది. టీడీపీని నమ్ముకున్న సీనియర్లకు చంద్రబాబు మొండి చేయి చూపించారు. దీంతో పార్టీలో తలుపులు మూసుకుపోవడంతో తాడోపేడో తేల్చుకొనేందుకు నేతలు బజారుకెక్కారు.

తేలని మైలవరం పంచాయితీ

మైలవరం పంచాయితీని తేల్చడం పార్టీ అధినేత చంద్రబాబు తరం కావటం లేదు. పార్టీలో ఇటీవల చేరిన వసంత కృష్ణప్రసాద్‌కే టికెట్ ఖాయమని చెప్పడంతో ఉమా ఆశలు ఆవిరయ్యాయి. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలిసింది. లోకేష్ జోక్యంతోనే ఆయనకు ఆ పరిస్థితి దాపురించిందని, కనీసం ఎమ్మెల్సీ హామీ కూడా ఇవ్వకపోడంతో, ఆయన రాజకీయ శకం ముగిసిందనే భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు పెనమలూరు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు టికెట్ లేదని అధిష్టానం సంకేతాలిచ్చింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బోడె ప్రసాద్, తన అనుచరులతో సమావేశం అయ్యారు. రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నారు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ ఎలా గెలుస్తుందో చూస్తానని సవాల్ విసిరారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండటంతో టీడీపీలో కాక రేపుతోంది.

విజయవాడ 'పశ్చిమ'లో అగమ్యగోచరం

విజయవాడ వెస్ట్‌లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే బుద్దావెంకన్న, జలీల్‌ఖాన్, ఎంకే బేగ్‌లు టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఆ సీటును జనసేనకు ఇస్తామని పార్టీ సంకేతాలు ఇవ్వడంతో బుద్దా వెంకన్న, అనుచరులతో సమావేశమై పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. జలీల్‌ఖాన్ కూడా పార్టీ వీడతానని బెదిరింపులకు దిగారు. చంద్రబాబు పట్టించుకోకపోవడంతో తెలుగు తమ్ముళ్లు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ పశ్చిమ నియోజక వర్గం తాజాగా బీజేపీకి కేటాయించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీంతో ఆ నియోజకవర్గంపై ఆశలు పెట్టుకొన్న జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్‌కు షాక్ తగిలింది. పదేళ్లుగా వెస్ట్‌లో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతోపాటు విజయవాడలో పవన్‌కల్యాణ్ ఖర్చులను పోతిన మహేష్ భరిస్తున్నారు. దీంతో తనకు టికెట్ ఖాయమనే నమ్మకంతో ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభించారు. 'పశ్చిమ'ను బీజేపీకి కేటాయించాలనే ప్రతిపాదనను పవన్‌కల్యాణ్ సమర్థించడంపై పోతిన మహేష్ మండిపడుతున్నారు. అదే జరిగితే పార్టీకి రాజీనామా చేసేందుకు కూడా వెనుకాడడని జనసేన కార్యకర్తలు చెబుతున్నారు. బీసీ అభ్యర్థికి టికెట్ ఇస్తానని డబ్బులు ఖర్చు పెట్టించి, మోసం చేయడంపై ఆ పార్టీలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

బుద్ధప్రసాద్‌కు షాక్

పొత్తు.. అవనిగడ్డలో టీడీపీ సీనియర్ నేత రాజకీయ జీవితానికి చెక్ పెట్టే పరిస్థితి కల్పించింది. అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించాలని బాబు నిర్ణయించారు. దీంతో నియోజకవర్గంతో సుదీర్ఘకాలం అనుభవం ఉన్న బుద్ధ ప్రసాద్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఆయన త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించాలని భావిస్తున్నారు.

పెనమలూరులో టీడీపీ టికెట్ రచ్చ
కంకిపాడు(పెనమలూరు): కృష్ణా జిల్లా పెనమలూరు టీడీపీలో టికెట్ రచ్చ తార స్థాయికి చేరింది. టీడీపీ ప్రకటించిన రెండో జాబితాలోనూ పెనమలూరు సీటుపై అధిష్టానం నాన్చుడు ధోరణి కనబర్చింది. సీటు తనకే వస్తుందన్న ధీమాతో ఉన్న మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ పెనమలూరు ఇన్‌చార్జి బోడె ప్రసాద్‌కు టికెట్ లేదని అధిష్టానం తేల్చిచెప్పేసింది. దీంతో బోడె దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చంద్రబాబు కుటుంబం మినహా మరెవరు పోటీ చేసినా తాను వెనక్కి తగ్గేది లేదని, పోటీ చేస్తానని బోడె తేల్చి చెప్పారు. పెనమలూరు నియోజకవర్గం కమ్మ సామాజిక వర్గ ప్రభావం, టీడీపీ ప్రాబల్యముందని ఆ పార్టీ భావన. దీంతో ఈ దఫా సీటు తమదంటే తమదని ఆ పార్టీలో నేతలు పోటీ పడుతున్నారు. ఇన్‌చార్జిగా ఉన్న తాను పార్టీకి కోట్లు ఖర్చుపెట్టానని సీటు తనదేనని బోడె ప్రసాద్ బాహాటంగా చెప్పుకొచ్చారు. 2014లో చేసుకున్న ఒప్పందాల మేరకు సీటు తమదేనని చలసాని పండు కుమార్తె దేవినేని స్మిత చెబుతున్నారు. వీరితో పాటుగా ఇటీవల పార్టీలో చేరిన తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి), మాజీ మంత్రి దేవినేని ఉమ, ఎంఎస్ బేగ్, తదితరుల పేర్లు వినిపించాయి. రెండు రోజులుగా ఐవీఆర్ఎస్ సర్వేలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌పై సర్వే జరగటంతో సీటు దాదాపుగా ఖరారైందని ఆ వర్గం భావించింది. చివరికి పార్టీ అధిష్టానం మొండి చేయి చూపింది. టికెట్ ఇవ్వకపోవడానికి.. బోడె ప్రసాద్‌పై ఉన్న అభియోగాలు ఒక కారణమైతే, వీటికి తోడు కార్యకర్తలను కలుపుకుని వెళ్లటంలో విఫలమయ్యారనేది మరో కారణం. మిత్రపక్షమైన జనసేనలోని వర్గాలతోనూ సఖ్యత లేదన్న ప్రచారం లేకపోలేదు. దీంతో అభ్యర్థిని మార్పు చేస్తే కొంత ప్రభావం తగ్గుతుందని భావించినట్లుగా రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. బోడెకు సీటు నిరాకరణతో ఓ కార్యకర్త ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేశాడు. సీటు స్థానికులకు ఇవ్వాలని, దిగుమతి నేతలను ఒప్పుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.

లోకేష్ తీరుతో గడ్డుపరిస్థితి..
టీడీపీలో లోకేష్ పెత్తనం పెరగడంతోనే పార్టీ గడ్డు పరిస్థితి ఎదుర్కోవలసి వస్తోందని ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా వారిని, సుదీర్ఘ రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న వారిని లోకేష్ ఉద్దేశ పూర్వకంగా అవమానిస్తున్నారని పలువురు సీనియర్లు విమర్శిస్తున్నారు. ఇప్పటికిప్పుడు సూట్‌కేసులతో వచ్చినవారికి పెద్దపీట వేస్తూ టికెట్ కేటాయిస్తున్నారు. దీనికి నిదర్శనం కేశినేని చిన్ని, వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణ ప్రసాద్ తదితరులు పార్టీలో చేరడమే. వేలం పాటలో టికెట్లు తన్నుకు పోయారని మండిపడుతున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను నమ్మిన వారిని నట్టేట ముంచుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోకేష్ పెత్తనంతో రానున్న రోజుల్లో టీడీపీకి ఘోర పరాజయం ఎదుర్కోక తప్పదని తేల్చి చెప్పారు.

గీతాంజలి మరణానికి టీడీపీ, జనసేనే కారణం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, మహిళలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదింటి మహిళ గీతాంజలి మరణానికి టీడీపీ, జనసేన పార్టీలే కారణమని, ఆమె మృతికి కారణమైన వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకల మానసిక దాడికి బలైన గీతాంజలి మృతికి నివాళులు అర్పిస్తూ, ఆమె మరణానికి కారకులైన దోషులను శిక్షించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి నూజివీడు రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు మంచి చేసున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని, మద్దతు తెలిపిన ప్రజలపై అసత్య ఆరోపణలు చేయడమే లక్ష్యంగా జనసేన, టీడీపీ సోషల్ మీడియా వ్యవహరిస్తోందని విమర్శించారు. జగనన్న తన సొంతింటి కలను నెరవేర్చారని సంతోషం వ్యక్తంచేసిన గీతాంజలిని సోషల్ మీడియా వేదికగా వేధింపులకు గురిచేసి, ఆమెను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించడం దారుణమన్నారు. ఆమె మరణానికి కారణమైన ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గీతాంజలి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆమె కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, పలువురు మహిళా నేతలు పాల్గొన్నారు.

వాంబే కాలనీలో....

ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు సూచనల మేరకూ స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో గీతాంజలి మృతికి కారణమైన వారిని శిక్షించాలని కోరుతూ వాంబేకాలనీ సీ బ్లాక్ నుంచి గాంధీజీ విగ్రహం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

సస్యరక్షణతో దిగుబడులు మధురం

- మామిడిలో పిందె, పూత రాలితే దిగుబడులపై ప్రభావం
- తెగుళ్ల యాజమాన్యం ఎంతో కీలకం
- నాణ్యమైన దిగుబడులతో సాగు లాభదాయకం
- కృష్ణా జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి



మామిడి తోటల్లో సస్యరక్షణ పనులు చేపడుతున్న రైతు

కంకిపాడు(పెనమలూరు): పండ్లలో మామిడిని రాజుగా పేర్కొంటారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో మామిడికి గడ్డు పరిస్థితి నెలకొంది. పూత, పిందె రాలిపోతోంది. తెగుళ్లు పంటపై విజృంభిస్తున్నాయి. నష్టాలను అధిగమించి, సాగు లాభదాయకంగా ఉండాలంటే మేలైన యాజమాన్య చర్యలు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి సూచిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో మామిడి ఆశించిన మేర దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

జిల్లాలో 5,586 హెక్టార్లలో సాగు

- కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న 25 మండలాల్లో ప్రస్తుత సీజన్‌లో 5,586 హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. ప్రస్తుతం చెట్లు పూత, పిందె మీద ఉన్నాయి. రైతులు సస్యరక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు.
- ప్రస్తుతం మామిడి పిందెలు నిమ్మకాయ సైజులో ఉన్నాయి. ఈ దశ నుంచి 15 రోజులకు ఒక సారి చెట్లకు క్రమం తప్పకుండా నీటి తడులు అందించాలి. నీరు అందించటం ద్వారా పిందె రాలటం ఆగిపోతుంది. కాయ పెరుగుదలకు దోహదపడుతుంది.
- పూత కాడపై, కాయ కాడలపై, కాయలపై ఆంత్రాక్నోస్ తెగులు వల్ల మచ్చలు ఏర్పడుతున్నాయి. హార్మోనల్ లోపం వల్ల పిందె రాలిపోతోంది. పిందె రాలుడు సమస్య అధికంగా గుర్తించాం. ఈ తెగులు నివారించేందుకు కాప్టాన్ లేదా కవచ్ లేదా ఆంట్రాకాల్ పిచికారీ చేసుకోవాలి. హార్మోన్ లోపం నివారణకు ప్లానోఫిక్స్ మిల్లీలీటరు 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పిందెలను గీకి రసాన్ని పీల్చటాన్ని గుర్తిస్తే తామర పురుగు ఆశించినట్లు నిర్ధారించుకోవాలి. పురుగు పిందెల రసం పీల్చటం వల్ల మంగు ఏర్పడే అవకాశం ఉంది. తేనె మంచు పురుగు ఆశించి మసి మంగు ఉధృతి చెందుతుంది. వీటి నివారణకు డెమోక్రాన్ లేదా రీజెంట్ లేదా థియామెథోక్సామ్ పిచికారీ చేసుకోవాలి.
- మామిడి కాయలు పెరుగుదల దశలో పండు ఈగ ఆశించి కాయలో గుడ్లుపెట్టి ఆ పురుగులు కాయలోనే పెరిగి కాయలు రాలిపోతాయి. ఈ పండుఈగ వల్ల పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీని నివారణకు నూజివీడు మామిడి పరిశోధనాస్థానంలో లభించే లింగాకర్షక బుట్టలను ఏర్పాటుచేసుకోవటం ఉత్తమం.
- రైతులు ప్రతి కాయను కాపాడుకోవాలి. కాయలకు కవర్లు తగించటం ద్వారా కాయ నాణ్యత బావుంటుంది. అదనపు ఆదాయం లభిస్తుంది. ఫ్రూట్ కవర్లు వినియోగం వల్ల అయ్యే ఖర్చు చాలా తక్కువ.

ఎగుమతులతోనే లాభాలు



మామిడి నాణ్యత బావుంటే మంచి రేటు లభిస్తుంది. కాయలు ఎగుమతులకు అనువుగా ఉంటే రైతు లకు లాభాలు వస్తాయి. వ్యాపారులు ఫ్రూ ట్ కవర్లు వినియోగించి పంట నాణ్యతను కాపాడుతున్న రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వారి వద్దే పంట కొనుగోలు చేస్తున్నారు. మంచి ధర అందుతుంది. సకాలంలో సస్యరక్షణ, పంట నాణ్యతపై దృష్టి పెడితే సాగులో లాభాలు ఆర్జించొచ్చు.

– జె.జ్యోతి, ఉద్యానశాఖ అధికారి, కృష్ణాజిల్లా

బీసీ కార్పొరేషన్ ఈడీగా శంకరరావు నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కె.శంకరరావును నియమిస్తూ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సీహెచ్.కిషోర్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.రాజేంద్రబాబు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్థానంలో వైజాగ్ బీసీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయంలో ఏఈఓగా పని చేస్తున్న కె.శంకరరావును ఉద్యోగోన్నతిపై నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫార్మసిస్టు గ్రేడ్-2 పోస్టుల మెరిట్ లిస్ట్ ప్రకటన

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజమండ్రి ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో ఫార్మసిస్టు గ్రేడ్–2 పోస్టుల నియామకాలను సంబంధించి అందిన దరఖాస్తులను పరిశీలించి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ ప్రకటించినట్లు ఆర్డీ డాక్టర్ పద్మశశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 15 నుంచి 18వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు తమ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలని ఆయన సూచించారు.

ఎన్నికల ఖర్చుపై అవగాహన అవసరం

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చు చేసే విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. తన చాంబర్‌లో గురువారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫారం-6, 7, 8లకు సంబంధించి వచ్చిన 5,445 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో తొలగింపులు సాధ్యపడవని స్పష్టంచేశారు. కేవలం చేర్పులకు మాత్రమే అవకాశం ఉంటుందని, ఈ లోగా తొలగింపులు ఏమైనా ఉంటే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలతో పాటు కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఖరారయ్యాయని వివరించారు. అందుకు సంబంధించిన వివరాలను పరిశీలించాలని రాజకీయ పార్టీలకు సూచించారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చు, పత్రికలు, టెలివిజన్, సోషల్ మీడియా, ఫ్లెక్సీలు, హోర్డింగ్, కరపత్రాలు, మాధ్యమాల ద్వారా చేసే రాజకీయ ప్రచార ప్రకటనలు, చెల్లింపు వార్తలపై నోడల్ అధికారి భాస్కరరావు, ఎంసీఎంసీ నోడల్ అధికారి ఎం.వెంకటేశ్వరప్రసాద్ ఆయా పార్టీ ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, పార్టీల నాయకులు పంతం గజేంద్ర, అబ్దుల్‌మతీన్, కొడాలి శర్మ, వంశీకృష్ణ, ఎస్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిపిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఈవీఎం గోదాముల తనిఖీ

కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజాబాబు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. గోదాము సీలును అందరి సమక్షంలో తెరిచి అందులోని బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు ఒక్కొక్క శాసనసభ నియోజకవర్గానికి శిక్షణ నిమిత్తం నియోజకవర్గాలకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. వాటిని ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గాలకు కేటాయించినట్లు వివరించారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వర్ణకారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఏపీ స్టేట్ ఎనర్జీ మిషన్ కన్వర్షేషన్ మిషన్ ప్రాజెక్టు ఆఫీసర్ హేమంత్ సూచించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీ విశ్వకర్మ గోల్డ్ క్లస్టర్‌లో స్వర్ణకారులకు విద్యుత్ వినియోగంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సహకారంతో స్వర్ణకారులు విద్యుత్ వాడకం తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఏపీ స్టేట్ ఎనర్జీ కన్వర్షేషన్ మిషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ హేమంత్ మాట్లాడుతూ.. విద్యుత్‌ను ఆదా చేసే సమర్థవంతమైన పరికరాలు వినియోగించాలని సూచించారు. విజయవాడ క్లస్టర్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ధనాలకోట శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా స్వర్ణకారులకు మిషనరీ వాడకంలో కరెంట్ ఆదా పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. కొంతమంది స్వర్ణకారులను ఎంపిక చేసుకుని వారికి ఉచితంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమ నోడల్ ఏజెన్సీ ఎండీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. స్వర్ణకారులకు తాము అందించే పరికరాలతో 40 శాతం విద్యుత్ ఆదా అవుతుందన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సౌమిత్రి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా స్వర్ణకారులకు సబ్సిడీ కార్యక్రమం క్లస్టర్ ద్వారా నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా స్వర్ణకారులకు ముద్ర లోన్స్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కామాక్షి స్వర్ణ సంఘం ప్రధాన కార్యదర్శి కె.హేమ సుందరం, కోశాధికారి అందే కృష్ణ సాయి, వన్‌టౌన్ కామాక్షి స్వర్ణకార సంఘం కోశాధికారి ఎస్.కె.సలీం, జి.భాస్కరరావు, దత్తు, రాజేష్, బాషా, ఇమంది రామారావు, టేకి వెంకటేశ్వరరావు, సోమల సుధాకర్ రావు, కణితి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'డీమ్డ్ టు బీ యూనివర్సిటీ'గా వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పెనమలూరు మండలం కానూరులోని వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు 'డీమ్డ్ టు బీ యూనివర్సిటీ' హోదా మంజూరు చేస్తూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేశారని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ కార్యాలయంలో ఆయన గురువారం విలేరులతో మాట్లాడారు. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఈ నెల 11 తేదీన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చట్టం, 1956 నిబంధనల ప్రకారం తమ కళాశాలకు ఈ గుర్తింపు మంజూరు చేసిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ మాట్లాడుతూ.. ఇటువంటి ప్రతిష్టాత్మక హోదాతో ఇంజినీరింగ్, టెక్నాలజీ, సైన్స్, సోషల్ సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, స్పోర్ట్స్ ఇతర విభాగాల్లో బహుళ పరస్పర ఆధారిత విద్యను, సాంకేతిక నైపుణ్య విద్యను విద్యార్థులకు అందించొచ్చని తెలిపారు. 2024 సంవత్సరానికి వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలు యూజీసీ నియమ నిబంధనలతో డీమ్డ్ టు బీ యూనివర్సిటీ కింద చేపట్టామని ప్రకటించారు. కళాశాలలో చదువుతున్న ప్రస్తుత విద్యార్థులందరూ ఆయా కోర్సులు పూర్తయ్యే వరకు జేఎన్‌టీయూ (కాకినాడ)కు అనుబంధంగా ఉన్న సంస్థగా కొనసాగుతారని స్పష్టంచేశారు. సిద్ధార్థ అకాడమీ చైర్మన్ చదలవాడ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ మలినేని రాజయ్య, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు, నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తదితరులు

కుమార్తెపై లైంగిక దాడిచేసిన తండ్రి అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రిని వీరవల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. బాపులపాడు మండలం వీరవల్లిలో ఈ ఘటన జరిగిన విషయం విదితమే. హనుమాన్‌జంక్షన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ట్రైనీ డీఎస్పీ డాక్టర్ వేదశ్రీ ఈ కేసు వివరాలను గురువారం వెల్లడించారు. ఆమె కథనం మేరకు.. వీరవల్లికి చెందిన బాలిక గ్రామంలోని స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. పెయింటర్‌గా పని చేస్తున్న బాలిక తండ్రి గత ఏడాది డిసెంబర్‌లో, ఈ ఏడాది జనవరిలో ఆమెపై లైంగికదాడి చేశాడు. ఇటీవల మరోమారు లైంగికదాడి చేయడంతో ఆ బాలిక తన తల్లికి జరిగిన దారుణాన్ని చెప్పింది. కన్నబిడ్డపై పశువుగా వ్యవహరించిన భర్తను ఆ తల్లి నిలదీసింది. ఆగ్రహించిన ఆ భర్త, భార్యను తీవ్రంగా కొట్టి, ఇంటి నుంచి పరారయ్యాడు. దీంతో బాలిక, ఆమె తల్లి ఇటీవల ట్రైనీ డీఎస్పీ డాక్టర్ వేదశ్రీకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న తండ్రి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం అతను ఇంటికి వచ్చినట్లు సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశామని ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం



పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టి.వి.వి.రామారావు కథనం మేరకు.. విజయవాడ భవానీపురానికి చెందిన పెడసనగంటి రామకృష్ణాచార్యులు తన తల్లి పుణ్యవతమ్మ (66)తో కలిసి ఈ నెల 12వ తేదీన బైక్ పై నెప్పల్లి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి బైక్‌పై విజయవాడ బయలుదేరారు. పోరంకి పచ్చళ్ల కంపెనీ వద్ద వారి బైక్ అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న రామకృష్ణాచార్యులు, పుణ్యవతమ్మ రోడ్డుపై పడిపోయారు. గాయపడిన ఇద్దరూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. వారిని 108 సిబ్బంది విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న పుణ్యవతమ్మ ఆరోగ్యం విషమించడంతో బుధవారం మృతి చెందింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి



గన్నవరం: పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీలో ఆ ఉపాధ్యాయిని పాల్గొన్నారు. విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులతో సరదాగా గడిపారు. ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న ఆమెను కంటైనర్ లారీ బలితీసుకుంది. ఈ ఘటన స్థానిక విమానాశ్రయం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు మండలం పోరంకిలో నివసిస్తున్న పాలంచు వరలక్ష్మి (58) స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్సు టీచరుగా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ ద్విచక్రవాహనంపై పోరంకి నుంచి పాఠశాలకు వచ్చివెళ్తుంటారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం పాఠశాల విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరారు. విమానాశ్రయం ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న అండర్ పాస్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఆమె ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో వరలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. ఆమె కుడి కాలు పూర్తిగా నుజ్జునుజ్జయింది. స్థానికులు ఆమెను హుటాహుటిన కానూరు రోడ్డులోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళా ఉద్యోగులకు అండదండలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులకు ఏపీ ఎన్జీఓ సంఘం అండగా ఉందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘం జిల్లా, రాష్ట్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఎన్జీఓ సంఘం భవనంలో మహిళా ఉద్యోగులకు బుధవారం క్రీడల పోటీలు నిర్వహించారు. గురువారం వ్యాస రచన, వక్తృత్వ, పాటలు, నృత్యాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. సంఘంలోని మహిళా విభాగం కూడా ఎంతో క్రియాశీలకంగా పోరాటాల్లో పాల్గొంటోందని అభినందించారు. మహిళా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్న కార్యాలయాల్లో ప్రత్యేక సౌకర్యాల కల్పన కోసం సంఘం కృషి చేస్తోందన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఈ పోటీలు శుక్రవారంతో ముగుస్తాయన్నారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్, క్యాపిటల్ సిటీ ప్రెసిడెంట్ నాగభూషణం, కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం విభాగం చైర్ పర్సన్ వి.నిర్మల కుమారి, కన్వీనర్ పి.మాధవి, కోశాధికారి శివలీల, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి బి.జానకి, మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి బి.తులసీరత్నం, ఎం.రాజ్యలక్ష్మి, వి.శాంతిశ్రీ, క్యాపిటల్ సిటీ సంయుక్త కార్యదర్శి ఎం.సరస్వతి, విజయవాడ నగర సంయుక్త కార్యదర్శి విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



టీడీపీ మాజీ సర్పంచ్ పరింకాయల పుష్పవతిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): మండలంలోని కొత్తపూడి, బుద్దాలపాలెం గ్రామాలకు చెందిన వందలాది మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు వారిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ మాజీ సర్పంచ్ పరింకాయల పుష్పవతి, ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు పరింకాయల అశోక్, పరింకాయల సుబ్బారావు, పరింకాయల రాధా, పరింకాయల కళ్యాణ్, పరింకాయల రాఘవయ్యతో పాటు కొత్తపూడి గ్రామానికి చెందిన మరో వందమందికి పైగా టీడీపీ నాయకులు, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. బుద్దాలపాలెం గ్రామానికి చెందిన తెలుగుతమ్ముళ్లు కాగిత విజయ్ సారథ్యంలో మరి కొందరు పార్టీలో చేరారు. వారికి పేర్ని కిట్టు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ.. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ పరింకాయల పుష్పవతి తదితరులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా టీడీపీకి పనిచేసినా తమను నమ్ముకున్న గ్రామస్తులకు మాత్రం ఏమీ చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఉపయోగంలేని పార్టీని వీడి ప్రజలకు సేవ చేసే పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, పొట్లపాలెం సర్పంచ్ గాజుల నాగరాజు, కానూరు, తపసిపూడి, మంగినపూడి, తాళ్లపాలెం, పోతిరెడ్డిపాలెం ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.